


షాన్ని కలగచేశాయి. కానీ.. మహేంద్రుడంటే మూడు లోకాలకూ అధికారి కదా! ఆయన మాటను పాటించక పోవడం ఉచితమేనా?! బుద్ధిమంతులు చేసే పనేనా?! సరే.. నన్ను మోసేవాడివి నువ్వేనని చెప్పుకొన్నావు కదా! ఏదీ నా చిటికెనవేలి బరువు మోయి చూద్దాం!'' అంటూ ఎడమచేతి వేలిని అతని వక్షస్థలంపై పెట్టాడు.

పిచ్చుకపై బండరాయి పడ్డట్లుగా గరుడుడు గిలగిలలాడిపోయాడు. బలం చాలక రెక్కలు రాలిపోతుండగా, కీచుకీచుమని అరుస్తూ..

''మహాత్మా! అపరాధం చేశాను. మన్నించు'' అని కన్నీరు కారుస్తూ శరణు వేడుకున్నాడు.

స్వామి కృపతో విడిచిపెట్టగా, పాపం అక్కణ్నుంచి నిష్క్రమించాడు.

అటుపైన సుముఖునికి, మాతలి కూతురైన గుణకేశితో అంగరంగవైభవంగా వివాహం జరిగింది. ఆ జంట చాలాకాలంపాటు సుఖంగా గడిపింది..

ఈ కథగల పుస్తకం మా ఇంట్లో ఉంటే చదివాను. దీనినిబట్టి, నాగకుమారులలో కూడా లోకాతీత సౌందర్యం కలవారు ఉంటారని అర్థం కావడం లేదా?! అందుకే మనకు ఎటువంటి పతులు కావాలన్నప్పుడు, నాగుల ప్రస్తావన తీసుకువచ్చాను..

* * *

..అంటూ మధుమతి చెప్పడం పూర్తిచేసింది.

త్వరలో అరుణోదయం కాబోతున్నదనే సూచనగా ఆకాశంలో వేగుచుక్క పొడిచింది.

''మనం ఇళ్లకు బయల్దేరే వేళయింది. మళ్లీ శుక్రవారం నాటికి ఇక్కడికి వచ్చి.. వ్రతాన్ని పరిసమాప్తి చేసుకుందాం. మనకు ఎటువంటి పతులు కావాలో అమ్మవారికి నివేదించుకున్నాం కదా! ఇక వారు ఏ జాతివారైనా.. అమ్మవారు మనకు ఉత్తములనే సమకూర్చుతుందని ఆశిద్దాం. మళ్లీ వచ్చినప్పుడు మనకు కాబోయే భర్తలకు అందించదగిన వస్త్రాలను, పూలమాలలు, లేపనాది వస్తువిశేషాలను ఇప్పుడే ఇక్కడ దాచిపెడదాం'' అన్నది వారుణి.

మిగిలిన వారందరూ సరేనంటూ దేవళంలోని ఒక గూటిలో ఆ దివ్యవస్తువులను నిక్షిప్తం చేసి.. మరొక్కసారి అమ్మవారికి మొక్కి, ఆకాశంలోకి ఎగిరిపోయారు.

అప్పటివరకు వారి మాటలను జాగ్రత్తగా ఆలకించిన విక్రముడు, ఆ గూడులోని వస్తువులను పరీక్షించాడు. నలుగురూ నాలుగు వేర్వేరు రంగులలోని వస్త్రాలను అక్కడ ఉంచడం.. శుభసూచనగా తోచింది. అతనిలో ఏదో కొత్తసంకల్పం కలిగింది. తటాకంలో స్నానం చేసి, అమ్మను పూజించాడు.

మంటపంలోని ద్వారపాలిక శిల్పం చేతిలోని ఖడ్గాన్ని తీసుకుని, సముద్రం దిశగా ప్రయాణమయ్యాడు. దారిలో అంతకుముందు తనను బాధించిన ముళ్లచెట్లను ఆ ఖడ్గం సాయంతో ఖండిస్తూ ముందుకు సాగాడు. దాంతో తీరంనుంచి అమ్మవారి గుడికి చక్కటి దారి ఏర్పడింది. సాయంకాలం వరకు సముద్రతీరంలోనే గడిపాడు. ముక్కలైన ఓడశకలాలు అక్కడక్కడా కనిపించాయి. అతడికి కొంత ఆశకలిగింది. వారధి బంధనానికి ముందు దక్షిణసముద్ర తీరంలో దర్భలపై శయనించిన శ్రీరాముడిలా ఆ రాత్రంతా అక్కడే గాయత్రీ ధ్యానంలో గడిపాడు.

తెల్లవారింది. గాయత్రీ మందిర తటాకంలోని నీరు తాగడం వల్ల అతనికి ఆకలి దప్పికలు లేవు. ఆ రోజంతా ఉత్తరదిక్కుగా సముద్రం వెంట సంచరించాడు. అది 'పోటు' సమయం కావడంతో సముద్రం కొంత లోపలికి పోయింది. బయటికి తేలిన జలచరాలు అతని రాకచూసి తటాలున బొరియల్లోకి దూరిపోసాగాయి. ముత్తెపు చిప్పలు, నత్తగుల్లలు పోగులుగా పడి ఉండి, కాళ్లకు గుచ్చుకుంటున్నాయి. వాటిని లెక్కచేయకుండా నడక సాగించాడు.

కొంతదూరంలో పెద్ద దారువొకటి ఒడ్డుకు చేరినట్లుగా కనిపించింది. పరిశీలించి చూడగా సముద్రపు ఓడ తెరచాప కొయ్యలాగా తోచింది. గోడనంటిన బల్లుల్లా దానిమీద ముగ్గురు పురుషులు బోర్లగిలపడి కనిపించారు. విక్రముడు వారిని గుర్తించాడు.

''హా సోదరులారా!'' అని అరుస్తూ వారి వద్దకు వెళ్లాడు.

వాళ్లింకా ప్రాణాలతోనే ఉన్నట్లు గుర్తించి సంతోషించాడు. గబగబా గట్టుమీదికి వచ్చి ఒక చెలిమెను తవ్వాడు. దానిలోని నీటితో వారి దేహాలపై ఉప్పుకసవుపోయేలాగా కడిగాడు. ముఖాలపై నీళ్లు జల్లి, జిడ్డుపోయేలాగా తుడిచాడు. పేరుపేరునా తమ్ముళ్లను పిలవసాగాడు. ఒక దొప్పలో నీరు తీసుకొచ్చి వాళ్లకు పట్టించాడు. కొంతసేపటికి వారికి తెలివి వచ్చింది. ఒడ్డుపై దొరికిన వెలగపళ్లు తీసుకొచ్చి, గుజ్జును తమ్ముళ్ల నోటిలో పిండాడు. ఆహారం దొరకగానే వారికి కొంచెం సత్తువ వచ్చింది.

''సోదరులారా! మీకు తగిన పానీయం తీసుకువస్తాను. ఒక్క నాలుగు గడియలలో తిరిగి వస్తాను. అప్పటివరకు ఇక్కడే విశ్రాంతి తీసుకోండి'' అని పలికి.. పరుగు పరుగున గాయత్రీ ఆలయానికి వెళ్లాడు. గర్భాలయంలో ఉన్న అభిషేకపాత్రను తీసుకుని, దానినిండా తటాకపు నీరు పట్టాడు. ఆలయంలోని మధుర ఫలాలు కోసుకుని, తమ్ముళ్ల వద్దకు హుటాహుటిన వెళ్లాడు.

అప్పటికే వారు ఒకరినొకరు పలకరించుకున్నారు. విక్రముడు ముందుగా వారికి ఫలరసాలు పట్టించిన తరువాత, తటాక జలాన్ని తాగించాడు. అమృతపానం చేసినట్లుగా వారికి శరీరంలో మిక్కిలిగా బలం కలిగింది.

అప్పుడు విజయుడు..

''అన్నా! నువ్వు క్షేమంగా ఉన్నావా?! మేమెలా గట్టు చేరామో తెలియదు. ఓడతోపాటే నేనూ సముద్రంలో పడిపోయాను. చేతికేమీ ఆధారం దొరకలేదు. చాలాదూరం ఈదుకుంటూ వెళ్లాను. ఆయాసం కలిగింది. ప్రాణాలమీద ఆశలు వదులుకున్నాను. అటువంటి సమయంలో భగవంతుని సంకల్పంలా నా పక్కనే ఒక పెద్దదారువు కొట్టుకు వస్తూ కనిపించింది. ఎలాగో దానిపైకి చేరుకున్నాను. తమ్ముళ్లిద్దరూ దానిమీద ఉన్నారని నాకు తెలియదు. రెండుదినాలు దానిమీదే గడిపాను. ఆ రెండురోజులూ చెరుపు మరుపులే కానీ, ఏమీ జ్ఞాపకం లేదు. తరువాత స్మృతి తప్పింది. ఇక్కడికెలా వచ్చిపడ్డామో తెలియదు'' అని తమ కథ చెప్పాడు.

చిత్రభానుడు అందుకుని..

''సోదరులారా! ఇప్పుడు మనమేం చేయగలం? ఇది ఏ దీవో తెలియదు. ఇక్కడ మనుష్య సంచారమే కనిపించడం లేదు'' అన్నాడు.

చివరివాడైన నలుడు..

''ఇది వరుణద్వీపం కాదు కాబోలు. మన ఓడలన్నీ మునిగిపోయాయి. మన వార్త అన్నగారైన శ్రీముఖునికి తెలియచేసే అవకాశం లేదు. ఇంక మనం క్రోధనుణ్ని జయించడం మాట దేవుడెరుగు?! ఈ సముద్రం దాటి ఇంటికి తిరిగి పోగలమా?!'' అని నిరాశ వ్యక్తం చేశాడు.

అప్పుడు విక్రముడు..

''సోదరులారా! పిరికితనం మానండి. వేదమాత సంకల్పం వల్లే మనం ఈ దీవికి కొట్టుకువచ్చాం. త్వరలో మనల్ని గొప్ప అదృష్టం వరించబోతున్నది. నా మాట నమ్మండి'' అంటూ తాను ఆ దీవికి వచ్చింది మొదలు.. గాయత్రీదేవి ఆలయాన్ని కనుగొనడం, అక్కడికి దేవకన్యలు రావడం, వారు చేపట్టిన వ్రతం వరకు గల వృత్తాంతమంతా వివరంగా చెప్పాడు.

తరువాత నలుగురూ ఆలయానికి వెళ్లారు. ముందు తటాకంలో స్నానం చేసి, వేదమాతను పూజించారు. అటుపైన విక్రముడు తన సోదరులకు దేవకాంతలు గూటిలో ఉంచిన దివ్యవస్త్రాలను చూపించాడు.

''సోదరులారా! మరో మూడురోజులలో శుక్రవారం రానున్నది. మనం ఈ వస్త్రాలను ధరించి, అప్పటివరకు గాయత్రీ మంత్రాన్ని ఉపాసిద్దాం'' అని ప్రబోధించాడు విక్రముడు.

వారు ఆ విధంగానే చేయసాగారు. శుక్రవారం రానే వచ్చింది. సూర్యోదయం అయ్యింది మొదలు ఆ నలుగురి హృదయాలూ దేవకన్యా దర్శనం కోసం ఉర్రూతలూగసాగాయి. ఎంతకూ పొద్దుగూకేలా అనిపించలేదు. అస్తమానం ఆకాశంకేసి చూడసాగారు. ఎట్టకేలకు నింగిలో చందమామ నక్షత్రాల నడుమ పూలగుత్తిలా దర్శనమిచ్చాడు.

దేవకన్యలు కూడా తమకు కాబోయే వరులను కలుసుకోవాలనే ఆశతో ఆవేళ త్వరగానే వచ్చారు. రాకుమారులు ప్రచ్ఛన్నంగా ఉండటం వల్ల, ఏ అనుమానం లేకుండా అమ్మవారి పూజ పూర్తిచేశారు. అటుపైన గూటిలో తాము ఉంచిన వస్త్రాలు, పూలదండలు కనిపించకపోవడంతో ఆనందపరవశంతో చుట్టూ చూడసాగారు.

అంతలో నాలుగు వేర్వేరు రంగుల వస్త్రాలను ధరించి నలుగురు రాకుమారులు వారి కళ్ల ముందు సాక్షాత్కరించారు. ■

**(వచ్చేవారం.. కపట యతులు)**